క్లుప్తంగా

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట రూరల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని బాలెంల గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని పల్లె ప్రగతిలో పలు అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకురాలి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ నాయకులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పిట్టల వినోద్ తల్లి, సీనియర్ నాయకురాలు ముత్తమ్మ శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ మృతురాలి ఇంటికెళ్లి ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ సాగర్ల బుచ్చయ్య, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గుండె ఈశ్వర్, తొట్ల శ్రీనివాస్, దుబ్బాక ఎల్లంరాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



వర్ధమానుకోటలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోటలో గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టి 28 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందమ్మ కల్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం స్వామివారిని గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అరవింద్, బ్రహ్మాచారి, ఆలయ కమిటీ సభ్యులు, బుర్రకథ బృందం, భక్తులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోల్ అమ్ముతున్నారని ఆందోళన



ఆందోళన చేస్తున్న యువకులు

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట) : మండల పరిధిలోని నెమ్మికల్ ఎస్ఆర్ పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం బంక్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దుబ్బతండా గ్రామానికి చెందిన జాటోత్ నరేష్ ఈ బంకులో గురువారం సాయంత్రం తన బైక్‌లో పెట్రోల్ పోసుకుని వెళ్లగా కోటినాయక్‌తండా వద్ద ఆగిపోయింది. మెకానిక్‌ను సంప్రదించగా పెట్రోల్‌లో నీళ్లు ఉన్న కారణంగా బైక్ పాడైందని చెప్పాడు. బైక్‌లో ఉన్న పెట్రోల్‌ను బాటిల్‌లో తీసుకొని శుక్రవారం ఉదయం బంకు వద్దకు రాగా బంకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం బంకు వద్ద ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న తహసీల్దార్ పుష్ప బంక్‌తో పాటు నరేష్ వద్ద పెట్రోల్ శాంపిళ్లను సివిల్ సప్లయ్ అధికారులకు పంపించారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

మద్దిరాల: మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కాడెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన పులుగుజ్జ మహేందర్ తన వ్యవసాయ భూమిలో తన ఎడ్లను మేత కోసం కట్టివేశాడు. అందులో ఒక ఎద్దు తాడును తెంపుకుని మేత మేసుకుంటూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.70వేలు ఉంటుందని, బాధిత రైతు తెలిపాడు.

బస్తీ దవాఖానా వైద్యాధికారిగా బండి వంశీకృష్ణ

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రామాపురంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా వైద్యాధికారిగా బండి వంశీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వంశీకృష్ణ మొదటి పోస్టింగ్ ఇక్కడే. అయితే బస్తీ దవాఖానా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో ఆయన ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు.

ఆర్టీసీకి సీజన్ జోష్





అర్వపల్లి నుంచి బస్సుల్లో నిండుగా వెళుతున్న ప్రయాణికులు

- పది రోజులుగా బస్సుల్లో పెరిగిన ప్రయాణికులు
- శుభకార్యాలతో సంస్థకు పెరిగిన ఆదాయం
- పేట-జనగామ రూట్లో బస్సులు పెంచాలని వినతి

అర్వపల్లి: శుభకార్యాల సీజన్ కావడంతో ఆర్టీసీకి కలిసి వస్తోంది. బస్సుల్లో పది రోజులుగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెరిగింది. దీంతో సహజంగానే ఆదాయం బాగా వస్తోంది. ఈ నెలంతా వివాహాలు, ఇతర శుభకార్యాలు ఉండటంతో ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. అలాగే విద్యార్థులు పరీక్షల కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతుండటంతో కూడా రద్దీ పెరిగిందని చెబుతున్నారు.

పేట-జనగామ రూట్లో పరిస్థితి ఇలా..

సూర్యాపేట-జనగామ రూట్లో ప్రయాణికుల రద్దీ పది రోజులుగా పెరిగింది. శుభకార్యాలు కావడం, ఎండలు మండిపోతుండటంతో ప్రతి ఒక్కరూ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఈ రూట్లో రోజూ 15 వరకు ఆర్టీసీ, పల్లె వెలుగు బస్సులు 30 ట్రిప్పుల వరకు తిరుగుతుంటాయి. ఈ బస్సులు సుమారు 4,500 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. సాధారణ రోజుల్లో రోజుకు రూ. 2లక్షల వరకు ఈ రూట్లో ఆర్టీసీకి ఆదాయం వస్తుంది. అయితే ఈనెల మొదటి నుంచి శుభకార్యాలు, వివాహాలు మొదలుకావడం, విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండటంతో బస్సుల్లో రెంట్టింపు స్థాయిలో ప్రయాణికులు వెళుతున్నారు. ఈ రూట్లో నిత్యం ఈ పెళ్లిళ్ల సీజన్ మొదలైనప్పటి నుంచి 3,200 మందికి పైగానే ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈసీజన్ పూర్తయ్యే వరకు బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సులు చాలడం లేదు



ప్రతిరోజు ఈ రూట్లో బస్సుల్లో ప్రయాణం చేస్తుంటాను. అయితే పదిరోజుల నుంచి పెళ్లిల సీజన్ కావడంతో బస్సులు నిండుగా వెళుతున్నాయి. ప్రతిరోజు నిలబడి సూర్యాపేటకు ప్రయాణం చేయాల్సి వస్తుంది. బస్సుల సంఖ్యను పెంచాలి.

– దడిపల్లి వెంకట్, ప్రయాణికుడు

ఎక్స్‌ప్రెస్ బస్సును నడిపించాలి



సూర్యాపేట-జనగామ రూట్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నడిపించాలి. ఈ రూట్లో కనీసం ఒక్కటి కూడా ఎక్స్‌ప్రెస్ బస్సు లేదు. అన్ని పల్లె వెలుగు బస్సులే ఉన్నాయి. సూర్యాపేట నుంచి జనగామ వరకు వెళ్లే ప్రయాణికులకు ఎక్స్‌ప్రెస్ బస్సు ఉంటే త్వరగా వెళ్లిపోవడానికి అవకాశం ఉంటుంది.

– పొన్న శ్రీనివాస్, అర్వపల్లి

చిన్నారులు క్రీడల్లోనూ రాణించాలి

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పందిబండ తండాలో తన తల్లి గుంటకండ్ల సావిత్రమ్మ పేరుతో స్థాపించిన ఎస్.ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పంపిణీ చేసిన క్రికెట్ కిట్లతో వారు ఆడుకుంటుండగా గమనించి మంత్రి కాన్వయ్ ఆపి కొద్దిసేపు వారితో ఉల్లాసంగా...ఉత్సాహంగా ఆడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, సర్పంచ్ గుగుతోతు కవిత, అనిల్ నాయక్, చాంప్లా నాయక్ పాల్గొన్నారు.



చిన్నారులతో క్రికెట్ ఆడుతున్న మంత్రి జగదీశ్ రెడ్డి

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధిహామీ కూలీలకు రోజువారి కూలీ రూ.600ఇవ్వాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. శుక్రవారం మండలంలోని తాటిపాముల గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలన్నారు. కూలీలు పని చేసిన చోట టెంట్, మంచి నీళ్లు, మెడికల్ కిట్లు అందించాలన్నారు. ఆయన వెంట బందెల అబ్రహాం, వెంకటయ్య, సోమక్క, రజిత, జానయ్య, యేసోబు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కడెం లింగయ్య

గొప్ప మనసున్న వ్యక్తి సీఎం కేసీఆర్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



పోలుమల్ల గ్రామంలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మద్దిరాల: గొప్ప మనసున్న వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మద్దిరాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన 29 కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ఆసరాగా ఉండాలని కల్యాణలక్ష్మి పథకం తీసుకువచ్చారని, ఈ పథకం కింద మండలంలో దాదాపుగా 1,087 మంది లబ్ధిదారులకు రూ.9.81కోట్లను అందజేసినట్లు చెప్పారు. అదేవిధంగా మండల కేంద్రం నుంచి ముకుందాపురం వరకు రూ.2.55కోట్లతో మంజూరైన పీఆర్, బీటీరోడ్డు, పోలుమల్ల గ్రామం నుంచి చందుపట్ల వరకు రూ.1.33కోట్లతో మంజూరైన పీఆర్, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పోలుమల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.26లక్షలతో పూర్తిచేసిన అదనపు తరగతి గదులు, పోలుమల్ల ఎస్సీ కాలనీలో డీఎంఎఫ్‌టీ, సీడీపీ నిధులు రూ.10లక్షలతో పూర్తి చేసిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్.ఏ.రజాక్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర, జెడ్పీటీసీ కన్న సురాంబ, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, గ్రంథాలయ కమిటీ జిల్లా డైరెక్టర్ దుగ్యాల రవీందర్‌రావు, వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, పీఆర్ డీఈఈ మహేందర్‌రెడ్డి, ఏఈ లావణ్య, ఏఓ వికాస్ పాటిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, తీగల వెంకన్న గౌడ్, మల్లు కళింగారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గుండ్ల నాగయ్య, మాజీ వైస్‌ఎంపీపీ తొన్కునూరి లక్ష్మణ్, సర్పంచ్ శిలివేరు భవాని, ఎంపీటీసీ ఏలేటి ఉమామల్లారెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మి, సుధీర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థి ఉన్నత చదువుకు ఆర్థిక సాయం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన పేద విద్యార్థి గంజి మహేష్ ఇంజనీరింగ్ విద్యకోసం స్ప్రెడ్ ఇండియా చైర్మన్ పటేల్ శ్రీధర్‌రెడ్డి అందించిన రూ.40వేల చెక్కును టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి శుక్రవారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ప్రెడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరుపేద కుటుంబాలను తన సోదరుడు శ్రీధర్‌రెడ్డి ఆదుకుంటున్నాడని తెలిపారు. ఇందులో భాగంగా బాలెంల గ్రామానికి చెందిన పేద కుటుంబం భద్రయ్య, అంజమ్మ దంపతుల కుమారుడు గంజి మహేష్ ఇంజనీరింగ్ విద్యకోసం ప్రతి ఏటా సొంత నిధులను అందిస్తున్నాడని, ఇప్పటి వరకు రూ.50వేలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న మహేష్ విద్య అవసరాల నిమిత్తం రూ.40వేలు ఇచ్చినట్లు చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఆలోచనతో స్ప్రెడ్ ఇండియా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు స్వామినాయుడు, గట్టు శ్రీనివాస్, ధరావత్ వెంకన్న, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌కు చెక్కు అందిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

ఘనంగా లక్ష నాగవల్లి అర్చన



లక్ష నాగవల్లి అర్చనలో పాల్గొన్న భక్తులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని తహసీల్దారు రోడ్డులో గల అతిపురాతనమైన శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 3వ రోజు లక్ష తమలపాకుల పూజను నిర్వహించారు. శ్రీభక్తాంజనేయ స్వామివారికి 10మంది అర్చకులతో 10మార్లు సహస్ర నామ అర్చనలు చేశారు. ఈ సందర్భంగా సుందరకాండ, విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం దరూరి శ్రీనాథ్ ఆచార్యులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు దరూరి శ్రీధరాచార్యులు, దరూరి శ్రీనాథ చార్యులు, దరూరి పవన్ కుమార్, దరూరి సంతోష్‌కుమార్, గోమతం వినోద్ ఆచార్య, తూపురాని లక్ష్మణాచార్యులు ,తూపురాని వేంకట కృష్ణమాచార్యులు, శ్రీవాత్సవ ఆచార్యులు, మరింగంటి ఉపేందర్, చింతాడ రామానుజ ఆచార్యులు, సముద్రాల చక్రధర్ ఆచార్యులు, సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేతలు మీలా మహదేవ్, మీలా వాసు దేవ్, మీలా జయ దేవ్, డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ కీసర దేవేంద్ర చార్యులు, పురం నాగరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్ , బోనగిరి వెంకటేశ్వర్లు, దంతాల కొండల నాయుడు పాల్గొన్నారు.

ఎదుగుదలను ఓర్వలేకనే ఆరోపణలు

తిరుమలగిరి (తుంగతుర్తి) : నియోజకవర్గంలో ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా చేస్తున్న సామాజిక సేవలను చూసి ఓర్వలేకనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆ ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ఇదే గ్రామానికి చెందిన కందుకూరి వెంకటయ్య, కందుకూరి నాగన్న, గిరికుమార్, లక్ష్మయ్య, ఆమనగంటి సోమయ్యల వద్ద మూడు ఎకరాల పది గుంటల భూమిని గతంలో కొనుగోలు చేసి భూమిని చదును చేసుకుంటుంటే కొద్ది మంది చెరువులోని భూమిని ఆక్రమించారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రైతుల వద్ద న్యాయబద్ధంగా కొనుగోలు చేశానని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సర్వే చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెరువు శిఖం భూమిని ఒక్క గుంట కూడా ఆక్రమించలేదని, తప్పు చేయలేదని తెలిపారు. నియోజకవర్గంలో ఆరాధ్య ఫౌండేషన్ సేవలు ఇంకా విస్తృత పరుస్తామని అన్నారు. అడుగడుగునా ఇబ్బందులకు గురి చేసినా, ఆరోపణలు చేసినా ఎవరికి తల వంచమన్నారు. చెరువు శిఖంలో భూమి ఉంటే ఆ భూమిని కూడా వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, ఏ రాజకీయ లబ్ధి కోసం పని చేయడంలేదన్నారు. సేవా దృక్పథంతో ముందుకెళతానని అన్నారు. సమావేశంలో జనగామ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు నర్సింహాగౌడ్, వీరేందర్, ఆచారి, సురేష్, వెంకన్న, బద్రిగౌడ్, మహేష్, జయపాల్‌నాయక్, ప్రసాద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్‌రాజ్

ఉద్యోగులను బెదిరించడం సరికాదు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఉద్యోగులను బెదిరించడం సరి కాదని మరో ఆరు నెలల్లో రాష్ట్ర ప్రజలే కేసీఆర్‌ను ఫామ్ హౌజ్‌కు పంపిస్తారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శుల శిబిరాన్ని శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న టీఆర్ఎస్ నాయకులు ఏనాడూ ఉద్యమాల్లో అరెస్టు కాలేదని, జైళ్లకు వెళ్లలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకుంటే తమ కలలు ఫలిస్తాయి అనుకున్న నిరుద్యోగులు, ఉద్యోగులకు ప్రస్తుత కేసీఆర్ పాలనలో ఆశలు అడియాసలయ్యాయన్నారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చకపోగా సమ్మె విరమించకుంటే, అంతు చూస్తామని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. సంవత్సరాల తరబడి ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకపోగా 9,355 గ్రామపంచాయతీ కార్యదర్శుల పోస్టులకు 8 లక్షల మంది అభ్యర్థులు పోటీపడి, సివిల్స్ పరీక్షల లాగా నెగటివ్ మార్కుల విధానం పెట్టినప్పటికీ, కష్టపడి అర్హత సాధించిన ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు కాంగ్రెస్ పార్టీ పక్షాన మద్దతు ఇస్తామని ప్రకటించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులకు రూ. 30వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టు శ్రీనివాస్, షఫిఉల్లా, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జేపీఎస్‌ల వంటావార్పులో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి

సమ్మెకు మద్దతు తెలిపిన ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీవైఎల్

తమను రెగ్యులరైజ్ చేయాలని 15 రోజుల నుంచి పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు కలెక్టర్ వద్ద ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, పీవైఎల్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలబోయిన కిరణ్ మద్దతు తెలిపారు. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న వరంగల్ జిల్లా రంగాపురం గ్రామ కార్యదర్శి సోనికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సక్క, సామ నర్సిరెడ్డి, చంద్రయ్య, లింగయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



సంతాప సూచకంగా మౌనం పాటిస్తున్న నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలగిరి (తుంగతుర్తి) : మే 16వ తేదీన తిరుమలగిరిలో జరిగే మారోజు వీరన్న యాదిలో పాటల నీరాజనం పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ప్రజా యుద్ధ నౌక గద్దర్ సమక్షంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట చింతకుంట్ల పరమేష్, దిలీప్‌నాయుడు, శ్రీను, చందు, నాగార్జున్, వెంకన్న, రాములు, అంజయ్య, చంద్రశేఖర్, రాము, రిషి, విష్ణు, ప్రేమ్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా యుద్ధ నౌక గద్దర్, ఏపూరి సోమన్న

విద్యార్థినికి సన్మానం

తుంగతుర్తి: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిన మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని గుజ్జ సంజనను శుక్రవారం మున్నూరుకాపు సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు గుజ్జ భాస్కర్, భిక్షం, అజయ్, వెంకన్న, మల్లయ్య, వేణు, నరేందర్, సూరి, నాగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో గుజ్జ సంజనను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

మారోజు వీరన్న ఆశయాలు సాధించాలి

తుంగతుర్తి: మారోజు వీరన్న ఆశయసాధనకు కృషి చేయాలని మారోజు వీరన్న అధ్యయన వేదిక కన్వీనర్ పత్తేపురం విజయ్‌కుమార్ అన్నారు.

శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో గ్రంథాలయ శంకుస్థాపన పోస్టర్లను ఆవిష్కరించారు. మారోజు వీరన్న వర్ధంతి సందర్భంగా ఈనెల-16న కొత్తగూడెంలో గ్రంథాలయానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బుక్కరాశి తిరుపతి, మేడబోయిన వెంకన్న, ఇరుగు కృష్ణ, ఈదునూరి మహేష్, బత్తుల శ్రీకాంత్, మట్టపల్లి శ్రీశైలం, సింహాద్రి, పూసపల్లి బిక్షం, నాగరాజు, కొమ్ము కృష్ణ, చిరంజీవి, లింగయ్య, అవిలయ్య, శ్రీను, సాగర్, వీరన్న, నరేష్ లెనిన్, మల్లయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మొక్కలను సంరక్షించాలి

సూర్యాపేట : మొక్కలను మనం సంరక్షిస్తే అవి మనలను రక్షిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా 48వ వార్డులో కౌన్సిలర్ వెలుగు వెంకన్నతో కలసి హరితహారం మొక్కలకు నీళ్లు పోసి సంరక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంతో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారి మండు వేసవిలో నీడనిస్తూ వర్షాలు కురిపిస్తున్నాయన్నారు. ఆయా వార్డుల్లో ప్రజాప్రతినిధులు మొక్కలను సంరక్షించడంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహాజన్, అజీమొద్దీన్, బొమ్మిడి అశోక్ పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

బాలికల అభివృద్ధికి తోడ్పాటునందించాలి



మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ మండల బాధ్యుడు చిప్పలపెల్లి రవి

నూతనకల్ : సమాజంలో బాలికల అభివృద్ధికి తోడ్పాటునందించే విధంగా తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలని ఎంవీఎఫ్ మండల బాధ్యుడు చిప్పలపెల్లి రవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లసింగారంలో ఐసీడీఎస్, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలురలతో సమానంగా బాలికలకు ఉన్నత విద్యా అవకాశాలను కల్పించి వారిని ప్రోత్సహించాలని కోరారు. బాల్య వివాహాలను నిర్మూలించడంతో పాటు వారిపై పెరుగుతున్న హింసలను అరికట్టి లింగవివక్ష నిర్మూలనకు పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సైరెడ్డి రమణ, కిశోర బాలికల ప్రతినిధులు రమ్య, వందన, సాయిగౌతమి, అక్షర, నవ్య, దీపిక, తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

15నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహలత



నూతనకల్ : మాట్లాడుతున్న ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవ రెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల స్థాయిలో నిర్వహించే సీఎం కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో మండల కేంద్రంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మండల పంచాయతీ అధికారి మారయ్య, రమేష్, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌ను విజయవంతం చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15 నుండి 17వరకు మండల స్థాయిలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డిలు కోరారు. శుక్రవారం మండల పరిషత్‌కార్యాలయంలో క్రీడల నిర్వాహణపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 15లోపు పీడీ హన్మంతరావును సెల్ నంబర్ 9441463903ను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, ఎంఈఓ రాములు నాయక్, దామెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

చిలుకూరు : గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాల్లో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ నిరంజన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీత్లాతండా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు పరీక్షలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధీరావత్ మంగమ్మ సైదులు, ఉపసర్పంచ్ శంకర్‌నాయక్, ఇన్‌చార్జ్ కార్యదర్శి ధర్మయ్య గౌడ్, డాక్టర్ నాజియా, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ధనియా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.